ఆంధ్రజ్యోతి *

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 6 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	190	220
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.130	190	215

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 20.2

నారసింహా.. నీ మొక్కు చెల్లించేదెలా?

యాదగిరీశా శరణు 2

ఆర్తత్రాణపరాయణుడు, ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో ఆర్జిత సేవల మొక్కులు చెల్లింపునకు భక్తులు నానాతంటాలు పడుతున్నారు. ఇష్టదైవం దర్శనాలతో పాటు మొక్కు ఆర్జితాల్లో కుటుంబసమేతంగా పాల్గొని నిర్వహిస్తే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ క్షేత్రంలో ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆర్జిత సేవల్లో పాల్గొనాలంటే భక్తులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఏ సేవల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక తికమక పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని మొక్కు సేవలు కొండ కింద ఉండటం, తీరా కొండపైకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు నిర్వహించుకోలేమని తెలిసి భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

● యాదగిరిగుట్ట



ఉద్ఘాటనకు ముందు ఆలయ ప్రాంగణంలో సేదతీరిన భక్తులు(ఫైల్)

యాదగిరికొండపైకి చేరుకున్న యాత్రికులు ముందుగా తాము మొక్కుకున్న ఆర్జిత సేవలను ఆచరించి కుటుంబసభ్యులతో కలిసి గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను దర్శించుకుంటారు. ఆ తర్వాత స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులకు, తోటి భక్తులకు పంపిణీ చేసుకోవడం ఆచారం. ఇదిలా ఉండగా ఏ వాహనంలోనైనా ముందుగా భక్తజనులు కొండపైకి చేరుకుంటారు. కాగా కొండపైకి వచ్చిన భక్తులు దేవస్థాన అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా ఆర్జిత సేవల నిర్వహణ కోసం కొండపైకి, కిందకు తిరగాల్సి వస్తుండడం భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. తీరా కొండపైకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు నిర్వహించుకోలేమని తెలిసి భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. మొక్కు టెంకాయ సమర్పణ ప్రహసనంగా మారగా మొక్కు కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హవన పూజల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక తలనీలాల సమర్పణ, వ్రతపూజలు కొండకిందకు మార్చడంతో భక్తుల ఇక్కట్లు మరింత రెట్టింపు చేస్తుండగా..ఏకంగా ఆలయ పునర్నిర్మాణం తర్వాత కొండపైన మూడు నిద్రల మొక్కు, మండల దీక్ష మొక్కులకు మంగళం పాడినట్లేనా అని భక్తులు వాపోతున్నారు.

కల్యాణోత్సవ సేవకు తప్పని తిప్పలు

ప్రధానాలయ అష్టభుజి అంతర్ ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హోమం మొక్కుల నిర్వహణకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ పరిస్థితులు మారిన సందర్భంలో ఈ సేవలను ప్రధానాలయ ముఖమండపం లేదా ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు వర్షం కురిసినా, వాతావరణం మబ్బులు పట్టి చల్లగా మారితే అధికారులే తలలు పట్టుకుంటున్నారు. ఆలయ విస్తరణ సమయంలో ఏకంగా 500 మంది దంపతులు స్వామివారి నిత్యకల్యాణోత్సవం నిర్వహించుకునేలా మండపాన్ని సకల సదుపాయాలతో నిర్మిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. నిత్యకల్యాణం, హోమపూజల కోసం అష్టభుజి ఈశాన్య ప్రాకారంలో కల్యాణోత్సవ మండపాన్ని నిర్మించారు. తీరా ఉద్ఘాటన అనంతరం మాత్రం దక్షిణ దిశలో ప్రాకార మండపంలో ఈ సేవలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాకార మండపం మూడు వైపులా తెరిచి ఉండడంతో సేవలో పాల్గొనే భక్తులు వానరాలతోనే సావాసం చేయాల్సిరావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. చివరకు దేవస్థాన సిబ్బంది ప్రాకార మండపంలో ఈ సేవలు పూర్తయ్యే వరకు పహారా కాస్తుండడం విశేషం. ఇదిలా ఉండగా తాము చేసిన తప్పిదానికి దిద్దుబాటు చర్యగా ప్రస్తుతం బాలాలయం ప్రాంతంలో దాత సహకారంతో కల్యాణమండపం నిర్మాణానికి సన్నాహాలు ఆరంభించగా..ఆ పనులు ప్రణాళికలకే పరిమితమయ్యాయి.

ధ్వజస్తంభాన్ని చూసి తరించాల్సిందే

ఏ దేవాలయానికి వెళ్లినా ప్రతీ భక్తుడు తప్పనిసరిగా ధ్వజస్తంభానికి మొక్కుకుని గర్భగుడిలో కొలువుదీరిన మూలమూర్తులను దర్శించుకోవడం ఆనవాయితీ. ఆలయ విస్తరణకు ముందు కొండకు వచ్చిన ప్రతీ భక్తుడు ముఖ మండపంలోని ధ్వజస్తంభం, బలిపీఠాలకు మొక్కుతూ గర్భాలయంలోనికి వెళ్లేవారు. ఒకవేళ రద్దీ చాలా ఎక్కువగా ఉన్న సమయంలో ఆలయ బయటనుంచే కనిపించే ధ్వజస్తంభాన్ని, విమానగోపురం గల సుదర్శన చక్రానికి మొక్కుకుని మరోమారు యాత్రకు వస్తామంటూ తిరుగు ప్రయాణమయ్యేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రధానాలయ ముఖమండపంలోనికి వెళ్లిన భక్తులకు మాత్రమే ధ్వజస్తంభాన్ని దర్శించుకోవాలే తప్ప దండం పెట్టుకునే అవకాశమే లేకుండా ఏర్పాట్లు ఉన్నాయి.

మొక్కు టెంకాయ సమర్పణ ఎక్కడ?

యాదగిరిగుట్టకు వచ్చిన భక్తులకు మొక్కు టెంకాయ సమర్పణ ప్రధాన సమస్యగా మారింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు టెంకాయలు సమర్పించడం ఆచారం. అయితే విస్తరణ అనంతరం మొక్కు టెంకాయ సమర్పణ సేవను విష్ణుపుష్కరిణి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్నారు. అయితే ఈ మార్గం గుండా ధర్మదర్శనాల భక్తులు వెళుతున్న వారికి టెంకాయ మొక్కు చెల్లించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే వీఐపీ దర్శన టికెట్ పొందిన భక్తులు, నేరుగా ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు మొక్కు టెంకాయ సమర్పణ కోసం వెతుకులాడాల్సి వస్తోంది. చివరకు గుడి పరిసరప్రాంతాల్లో కొందరు విడిచిపెట్టి వెళుతుండగా, తూర్పు రాజగోపురం ముందు టెంకాయలతో వచ్చిన భక్తుల నుంచి ఆలయంలోనికి అనుమతి లేదంటూ దేవస్థాన సిబ్బంది టెంకాయలను తీసుకుని ద్వారం వద్ద వదిలివేస్తున్నారు. దీంతో భక్తులు స్వామికి మొక్కుటెంకాయ సైతం సమర్పించుకునే భాగ్యం తమకు లేకుండా పోతుందని వాపోతున్నారు.



వ్రత పూజలు కొండకిందనా?

స్వామి సన్నిధిలో సత్యనారాయణస్వామి వ్రత పూజల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగి ఉందని స్థల పురాణం చెబుతోంది. ఆలయ విస్తరణలో భాగంగా వ్రత మండపాన్ని కొండకింద మూడో ఘాట్‌రోడ్డు సమీపంలో నిర్మించారు. అయితే తమ ఇళ్ల నుంచి నేరుగా కొండపైకి చేరుకున్న భక్తులు వ్రత పూజలు చేపట్టేందుకు పిల్లాపాపలతో కొండకిందకు వెళ్లాల్సి రావడం భక్తులను ప్రయాసలకు గురిచేస్తోంది.



కొండపైన వ్రత పూజల్లో పాల్గొన్న భక్తజనులు(ఫైల్)

కలగా మూడు నిద్రల మొక్కు

స్వయంభూ పాంచనారసింహుడు వెలిసిన కొండపైనే మూడు నిద్రలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వాసం. అలనాడు యాదరుషి కఠోరమైన తపస్సుతో స్వామిని సాక్షాత్కారం చేసుకున్నాడని, స్వామి సన్నిధిలో మూడు నిద్రలు చేస్తే యాదరుషి పొందిన ఫలితం కలుగుతుందని భక్తుల నమ్మకం. గతంలో భక్తులు కుటుంబసమేతంగా కొండపైనే వసతి గదులు లభించకున్నా.. ఆలయ తిరువీధుల్లోనే నిద్రచేసి మొక్కులు చెల్లించుకునేవారు. ప్రస్తుతం కొండపైన ఎలాంటి డార్మెటరీ హాల్స్ తదితర నిర్మాణాలు లేకపోవడంతో మూడు నిద్రల మొక్కు క్షేత్రానికి వచ్చిన భక్తులకు కలగానే మారింది.



కొండపైన వసతి గదుల సముదాయం (ఫైల్)

తల నీలాల మొక్కు తీరినట్టేనా!

స్వామివారి దర్శనాలకు విచ్చేసిన భక్తులు కొండ కింద మొక్కుతలనీలాలు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో తమ మొక్కులు తీరినట్టేనా అన్న ఆందోళనలో ఉన్నారు. చేసేదేమీ లేకపోవడంతో మొక్కుబడిగా మొక్కుతలనీలాలను చెల్లించుకుంటున్నారు. మొక్కుతలనీలాలు తీసిన వెంటనే మహిమాన్విత విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించే వారమని, ఇప్పుడు కొండకింద తలనీలాలు తీసి పక్కనే ఉన్న లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు చేస్తున్నారు. మహిమాన్విత విష్ణుపుష్కరిణితో కృత్రిమంగా నిర్మాణం జరిపి లక్ష్మీపుష్కరిణిగా ఎలా పోల్చుకోగలమని భక్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



కొండపైన తలనీలాలు సమర్పిస్తున్న భక్తజనులు(ఫైల్)

- అనాలోచిత నిర్ణయాలతో అష్టకష్టాలు
- తలానీలాల నుంచి మొక్కు టెంకాయ వరకు అంతా అసౌకర్యమే

గుడి వద్దే టెంకాయ సమర్పణ ఉండాలి



కొండపైన గుడివద్దే మొక్కు టెంకాయలు సమర్పించుకునే విధంగా ఏర్పాట్లు ఉండాలి. చిన్నప్పటి నుంచి కుటుంబసమేతంగా గుట్టను సందర్శిస్తున్నా. పాతగుడి, బాలాలయంలోనూ దర్శనాలనంతరం గుడి కి సమీపంలోనే కొబ్బరికాయలు కొట్టేవాళ్లం. అదే పద్ధతి కొనసాగిస్తే అందరికి అనువుగా ఉంటుంది. ప్రస్తుతం టెంకాయ కొట్టడానికి తిరిగి బస్ స్టాండ్ వద్దకు రావాల్సివస్తోంది.

- శైలజాప్రసాద్, భక్తురాలు, హైదరాబాద్

నిత్యకల్యాణ మండపం నిర్మించాలి



పూర్తిగా కృష్ణశిలలతో ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషకరమే. కానీ నిత్యకల్యాణోత్సవానికి ప్రత్యేకంగా కల్యాణమండపం నిర్మిస్తే బాగుండేది. స్వామివారి నిత్యకల్యాణోత్సవంలో ఎంతో భక్తి ప్రపత్తులు, శ్రద్ధతో కుటుంబసమేతంగా పాల్గొంటాం. ఇప్పుడున్న అష్టభుజి ప్రాకార మండపంలో ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, కోతులకు భయపడుతూ కల్యాణోత్సవంలో పాల్గొనాల్సి వస్తోంది. అధికారులు గమనించి భక్తుల సౌకర్యంతో పాటు కల్యాణమూర్తుల వద్దకు కోతులు రాకుండా సరైన సదుపాయాలతో నిత్య కల్యాణం, హోమ పూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- జీపీఆర్ లక్ష్మి, భక్తురాలు, సరూర్‌నగర్

ఆర్జితాలన్నీ కొండపైనే ఉండాలి

యాదగిరికొండకు కుటుంబసమేతంగా వచ్చి ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని దర్శించుకుని వెళతాం. కొన్ని సేవలు కింద, కొన్ని సేవలు కొండపైన ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చంటిపిల్లలు, వృద్ధులతో కలిసి సేవల్లో పాల్గొనాలంటే ఇటు, అటూ తిరగడంతోనే పుణ్యకాలం పూర్తవుతోంది. సకాలంలో పూజలకు చేరుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అన్ని ఆర్జితాలు కొండపైనే ఉంటే ఇబ్బందులు పూర్తిగా తప్పుతాయి.

- ఎస్ మౌనిక, భక్తురాలు, రామంతాపూర్

కేసీఆర్‌ను దూషించిన రేవంత్‌కు బుద్ధి ఉందా?

సీఎం మాటతీరు ఇట్లనే ఉంటే తెలంగాణ ప్రజలు గోరీకడతారు

మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



గుట్టలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కడియం

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 5: 'తెలంగాణ రాష్ట్ర సాధకుడు, పది సంవత్సరాలు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌ను అసభ్య పదజాలంలో దూషించిన సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి ఉందా' అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో సోమవారం జరిగిన ఆలేరు బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం మాటతీరు ఇలాగే ఉంటే తెలంగాణ ప్రజలు గోరీకట్టడం ఖాయమన్నారు. కృష్ణా ప్రాజెక్టు నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగిస్తే పోరాటం తప్పదని, ఆయనకు ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలను కాపాడడం కోసం తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డాగా మార్చారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు వినతిపత్రాలు ఇచ్చి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కేవలం మహాలక్ష్మీ పథకంలోని మహిళలకు ఉచి తబస్సు, పథకం ఒక్కటే 50రోజులలో అమలు చేశారని, సీఎం కాగానే మొదటి సంతకం రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తామని, రైతుబంధుకు బదులు రైతు భరోసా పథకం ద్వారా రూ.15వేలు రైతులకు అందిస్తామని హామీలు ఇంతవరకు అమలు చేయలేద ని ప్రశ్నించారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన తీరు మార్చుకోవాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు ఏ సీఎం చేపట్టలేదన్నారు. గతంలో గుట్టలో మాజీమంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేసిన 100 పడకల ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణ విషయంలో తాను ఎలాంటి జోక్యం చేసుకోకుండా, ఈవోతో సఖ్యత లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారని దాంట్లో నిజం లేదని కేసీఆర్ కల నెరవేరడానికి తాను పనుల్లో జోక్యం చేసుకోలేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బీసీలకే భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ రాష్ట్రస్థాయి నాయకుల దృష్టికి తెచ్చారు. గతంలో బీసీలకే కేటాయించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ బిక్కూనాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మం డ ల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, మునిసిపల్ చైర్మన్ శంకరయ్య, నాయకులు గడ్డమీది రవీందర్‌గౌడ్, కసావు శ్రీనివాస్‌గౌడ్, పాపట్ల నరహరి, జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, పల్లెపాటి సత్యనారాయణ, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 5 : మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు క్షమించరని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణను సాధించి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ సొంతమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఆరు గ్యారెంటీలు అమలుచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. హామీల అమలును ప్రశ్నిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అసహనంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి బీఆర్ఎస్ ఆందోళన చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, నీలం ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కలెక్టర్ హనుమంతు కె. జెండగే



కలెక్టరేట్‌లోఅధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే. జెండగే అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ చట్టం-2018, విధులు, బాధ్యతలపై కలెక్టరేట్‌లో సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక అధికారులు ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు చేపట్టే గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్లను పరిశీలించాలన్నారు. అభివృద్ధిలో భాగమైన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్స్, తడి, పొడి చెత్త సేకరణ, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు నిర్వాహణ, టాక్స్ కలెక్షన్ పరిశీలించాలన్నారు. వేసవి ప్రారంభం కానున్న తరుణంలో ఇంటింటికి తాగునీరు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పైపు లైన్ లీకేజీలు మరమ్మతులు చేపట్టి అంతర్గత పనుల పట్ల శ్రద్ధ కనబర్చాలన్నారు. ఉపరితల జలాశయాలు నెలలో ప్రతి 1, 11,21వ తేదీల్లో శుభ్రం చేసి కొత్తగా నిర్మించిన ఇళ్లకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. వీదుల్లో, రోడ్ల వెంట మురుగు నీరు నిల్ల ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులపై సకాలంలో తీర్మానాలు చేసి సత్వర గ్రౌండింగ్ జరిగేలా చూడాలన్నారు. జూన్, జూలై మాసాల్లో నర్సరీల్లోని మొక్కలను సంరక్షించి, మొక్కలు నాటేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలన్నారు. పంచాయతీల ఆస్తులను పరిరక్షించి లే-అవుట్లను పరిశీలించి తప్పనిసరిగా లే-అవుట్లలోని పది శాతాన్ని పంచాయతీలకు చెందేలా, నిబంధనల ప్రకారం భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఏడు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీల్లో రికార్డులను ఆడిట్ చేయించాలని, ప్రతి నెలా సిబ్బందికి జీతాలు, సీసీ బిల్లులు, ట్రాక్టర్, ట్రాలీ, పేమెంట్లు చెల్లించేలా చూడాలన్నారు.పంచాయతీల ఆదాయ మార్గాలను పరిరక్షించి రిజిస్టర్ నిర్వహించాలన్నారు. తద్వారా వచ్చే నిధులతో పారిశుధ్యం, గ్రీవెన్స్, టాక్స్ కలెక్షన్, బడ్జెట్ తదితర రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రొటోకాల్ నిబంధనలు పాటించేలా,అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.సంబంధిత శాఖల అధికారులు గ్రామ సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవడంతో పాటు యువత అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. పంచాయతీరాజ్ చట్టంలో సూచించిన విధంగా క్షేత్ర స్థాయిలో బాధ్యయుతంగా పనులు పూర్తి చేయడమే కాక పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది సమన్వయంతో ప్రజల అవసరాలు తీర్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, డీఆర్డీవో టి. నాగిరెడ్డి నూతన పంచాయతీరాజ్,జడ్పీసీఈవో సి.హెచ్ క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 5: పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనున్న నేపథ్యంలో అభ్యర్థులకు భువనగిరి జిల్లా ఆస్పత్రిలో సోమవారం వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. రాచకొండ కమిషనరేట్‌లోని 600 మంది అభ్యర్థులకు ఐదు రోజుల పాటు 11మంది వైద్యులతో పలు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. రోజుకు 120 మందికి పరీక్షలు నిర్వహిస్తారు. ఉద్యోగాల ఎంపికకు తుది పరీక్షగా పేర్కొనే వైద్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. డీసీపీ ఎం. రాజేష్‌చంద్ర, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నానాయక్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఏసీపీ సీహెచ్ మహేశ్వర్, సీఐ వెంకటేశ్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి.



జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

'ప్రజావాణి' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజా సమస్యలను తీర్చేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. 18 అర్జీలు అందాయని, అందులో రెవెన్యూకు సంబంధించి 9, మునిసిపాలిటీ 4, మెప్మా 2, విద్యాశాఖ, కాలుష్య నియంత్రణ, ఉపాధి కల్పన శాఖలకు సంబంధించి ఒక్కొక్కటిగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పద్మజారాణి, డీఆర్డీవో టీ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏవో సీ జగన్, అధికారులు పాల్గొన్నారు. కాగా, యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణానికి ఖర్చు చేసిన రూ.1200కోట్ల నిధులపై విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కోట్లు ఖర్చు చేసినా, భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేయలేకపోయారని వీటితో పాటు 17 డిమాండ్లను అర్జీలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బోలగాని సత్యనారాయణ, కళ్లె క్రిష్ణ, చెక్క వెంకటేశ్, ఏశాల అశోక్, బండి జంగమ్మ పాల్గొన్నారు. ప్రభుత్వం నిరుపేదల కోసం జిల్లా కేంద్ర భువనగిరిలో కేటాయించిన స్థలాన్ని చూపాలని కోరుతూ ఫిర్యాదు అందజేశారు. కారుణ్య నియామకం కింద భువనగిరి మునిసిపాలిటీలో ఉద్యోగిగా పనిచేస్తూ మృతి తన తల్లి ఉద్యోగం ఇవ్వాలని పట్టణానికి చెందిన పారునంది మాతయ్య ఫిర్యాదుచేశారు.

మీ-సేవా కేంద్రాల్లో అక్రమ వసూళ్లను అరికట్టాలి

మోత్కూరు: మోత్కూరు మండల కేంద్రంలోని మీ-సేవా,ఆధార్ నమోదు కేంద్రాల్లో నిర్వాహకులు చేస్తున్న అక్రమ వసూళ్లను అరికట్టాలని కోరుతూ వినియోగదారుల సంక్షేమ సంఘం మోత్కూరు అధ్యక్షుడు పోచం సోమయ్య ప్రజావాణిలో కలెక్టర్ హేమంత్ జెండగేకు వినతిపత్రం అందజేశారు. ఆయా కేంద్రాల్లో ప్రభుత్వ రుసుముకు మించి సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయా కేంద్రాల్లో పౌర సేవల ధరల పట్టిక ఏర్పాటు చేయడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో వారు తమ ఇష్టారాజ్యంగా రుసుములు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో హరిహరులకు విశేష పూజలు



శివాలయంలో స్ఫటికమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. స్వయంభూ లక్ష్మీనారసింహుడికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో, అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, స్ఫటిక మూర్తులకు శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో లక్ష్మీనృసింహుడిని మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలోని మూలమూర్తులకు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు విశ్వక్సేనుడికి తొలి పూజలతో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరుడిని, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల సహస్రనామ పఠనాలతో బిల్వపత్రార్చనలు నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల అలంకార వెండి జోడు సేవలు, శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.34,02,176 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

ఆధార్, రేషన్‌కార్డు అనుసంధానం చేయించుకోవాలి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలులో భాగంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు ల నంబర్లను గృహ విద్యుత్ సర్వీస్ నంబర్‌కు జత చేయవలసి ఉంటుందని చౌటుప్పల్ మండల ట్రాన్స్‌కో ఏఈ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విద్యుత్ సరఫరా బిల్లింగ్ కోసం ఇళ్ల వద్దకు వచ్చే ఆపరేటర్‌లు, లైన్‌మన్‌లకు ఆధార్ కార్డు, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలను అందజేసి, సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ఎంపీపీ కవితకు మరో షోకాజ్ నోటీస్?

కోదాడ రూరల్, ఫిబ్రవరి 5: మాజీ ఎంపీపీ కవితకు కలెక్టర్ వెంకటరావు మరో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. కోదాడ ఎంపీపీగా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో మండల పరిషత్‌కు సంబంధించిన రూ.40లక్షలు దుర్వినియోగం చేశారని ఎంపీటీసీలు, జడ్పీటీసీ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆయన కవితకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ నోటీస్‌కు కవిత స్పందించకపోవడంతో తిరిగి మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం మరో నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.

నిందితుడికి ఆరు నెలల జైలు

కట్టంగూరు, ఫిబ్రవరి 5: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ నకిరేకల్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు కట్టంగూరు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసుకు సంబంధించి ఏఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... 2015మే 20వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో మండలంలోని పరడ గ్రామానికి చెంది మాగి భిక్షం, కోనేటి యాదయ్య, సుంకరబోయిన వెంకన్న ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం నుంచి కట్టంగూర్‌కు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో పావన గుండ్ల సబ్‌స్టేషన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఏపీ 10 ఏక్యూ 8912 నెంబర్ గల కారు అతివేగంగా, అతిజాగ్రత్తగా ముందుగా వెళ్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న మాగి భిక్షం, కోనేటి యాదయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సుంకరబోయిన వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. భిక్షం కుమారుడు ప్రకాష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ విజయ్ ప్రకాష్ కేసు నమోదు చేసి చార్జీషీటు ఫైల్ చేశారు. సోమవారం రోజు నకిరేకల్ మెజిస్ట్రేట్ విచారణ జరిపి నేరం రుజువైనందున కారు డ్రైవర్ వడ్లపల్లి చిదానందకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కూరెళ్ల విఠలాచార్యకు సన్మానం



విఠలాచార్యను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రామన్నపేట, ఫిబ్రవరి 5: పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కూరెళ్ల విఠలాచార్యను చౌటుప్పల్ మండల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్నాటి శంకరయ్య, కానుగుల వెంకటయ్య, భీమిడి మోహన్‌రెడ్డి, ముటుకుల్లోజు పాండురంగాచారి, సహాధ్యక్షుడు చొల్లేటి రాజయ్య ఉన్నారు.

చికిత్సపొందుతూ కార్మికుడు మృతి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: చికిత్సపొందుతూ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన రాంజీ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని బోరబండలో ఉంటున్నాడు. భువనగిరి శివారులోని పగిడిపల్లి పరిధిలో సికింద్రాబాద్‌లోని మాణెపల్లి జువ్వెలర్స్ ఆధ్వర్యంలో బాలాజీ టెంపుల్ నిర్మిస్తున్నారు. ఆ టెంపుల్‌లో ఫ్లోరింగ్ వేసేందుకు రాంజీ అనే కూలీ జనవరి 26న కొలతలు తీస్తుండగా లిఫ్ట్ కోసం తీసిన గుంతలో జారి పడడంతో గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు.

పంటలకు జీవం


ఆయకట్టులో సాగు చేసిన పొలాలు

- మేజర్లకు కొనసాగుతున్న నీటి విడుదల
- ఊపిరి పోసుకుంటున్న ఎండుతున్న పొలాలు
- రైతుల్లో చిగురించిన ఆశలు


కొనసాగుతున్న నీటి విడుదల

నిడమనూరు, ఫిబ్రవరి 5: నిడమనూరు మండలం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మేజర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రధానకాల్వకు నీటి విడుదల కొనసాగుతున్నందున మేజర్ కాల్వలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నందున రైతుల విజ్ఞప్తి మేరకు ముదిమాణిక్యం, నారెళ్ల గూడెం మేజర్లకు ఆదివారం ఉదయం నుంచి ఎన్నెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో అనేక మంది రైతులు యాసంగిలో పంటలు సాగు చేశారు. నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కొందరు బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నందున అనేక చోట్ల పొలాలు నెర్రెలు బారి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొలాలు కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపేందుకు ప్రభుత్వం సాగర్ ప్రధానకాల్వకు ఇటీవల నీటిని విడుదల చేశారు. ఆయకట్టులో సాగు చేసిన పొలాలు తమ కళ్ల మందే ఎండిపోతున్నా, పక్క జిల్లాలోని రిజర్వాయర్ నింపేందుకు మాత్రం నీటిని విడుదల చేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో తమ పంటలు కాపాడుకునేందుకు నిడమనూరు, అడవిదేవులపల్లి, దామరచర్ల, త్రిపురారం మండలాలకు చెందిన పలువురు రైతులు ఇటీవల ముదిమాణిక్యం మేజర్ వద్ద నీటిని విడుదల చేసుకునేందుకు ప్రయత్నించారు. కానీ మేజర్లకు నీటి విడుదలకు అనుమతి లేదని అధికారులు రైతులను అడ్డుకున్నారు. రాత్రి సమయంలో రైతులు మేజర్ షట్టర్ ఎత్తి నీటిని విడుదల చేస్తారనే భయంతో అధికారులు, పోలీసులు మేజర్ వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో రైతులు ఎండుతున్న పొలాల గురించి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పంటల పరిస్థితి వివరించారు. దాంతో వారు ఎన్నెస్పీ ఉన్నతాధికారులతో మాట్లాడి మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేసే విధంగా ఆదేశాలు ఇప్పించడంతో నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ముదిమాణిక్యం మేజర్‌కు 400 క్యూసెక్కులు, నారెళ్ల గూడెం మేజర్‌కు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా మేజర్లకు ఎన్ని రోజులు నీటిని విడుదల చేస్తారనేది సరైన ఆదేశాలు రాలేదు. ప్రజా ప్రతినిధుల చొరవతో మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎండిపోతున్న పొలాలకు జీవం పోసినట్లయిందని రైతులు భావిస్తున్నారు. ప్రధానకాల్వకు మరో మూడు రోజులపాటు నీటి విడుదల కొనసాగనుంది. దీంతో మేజర్లకు సైతం నీటిని విడుదల చేసే అవకాశం ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే జైవీర్ చొరవ వల్లే సాగు నీరు

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి చొరవ తీసుకోవ డం వల్లే మేజర్లకు సాగునీరు విడుదల అవుతోంది. ఆయకట్టులో యాసంగిలో సాగు చేసిన పొలాలు ఎం డిపోతున్నందున తమ పరిస్థితి ఎమ్మెల్యేకు వివరించడంతో ఆయన స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి కాల్వలకు నీటిని విడుదల చేయించారు. నీటి విడుదల తో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- గడ్డం గోవిందరెడ్డి, రైతు, నారమ్మగూడెం

నారెళ్లగూడెం మేజర్‌కు 70 క్యూసెక్కుల నీరు

నారెళ్లగూడెం మేజర్ కాల్వ డిజైన్ డిశ్చార్జి ప్రకారం 80క్యూసెక్కులకు ప్రస్తుతం కాల్వకు 70క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. ఎన్ని రోజులపాటు నీటిని విడుదల చేసే విషయం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఉంటుంది. ప్రస్తుతానికి అయితే నీటి విడుదల కొనసాగుతుంది.

- ప్రవీణ్‌రాజు, ఏఈ


అనంతారంలో వ్యక్తి సజీవ దహనం

- హత్యా..? ఆత్మహత్యా..? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు
- ద్విచక్రవాహనం సహా దహనమైన వ్యక్తి
- బైక్ నెంబర్ ఆధారంగా బంధువులకు సమాచారం
- యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన


నాగరాజు (ఫైల్)

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి సమీపంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనంతారం గ్రామ ఫ్లైఓవర్ కింద దారుణం జరిగింది. ద్విచక్ర వాహనం సహా ఓ వ్యక్తి సోమవారం దహన మై కన్పించాడు. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి అతనిని హత్య చేసి ఉంటారని అను మానాలు వ్యక్తమవుతున్నాయి. బైక్ నుంచి మంటలు వస్తుండ డంతో గమనించిన స్థానికులు వెంటనే భువనగిరి రూరల్ పోలీసులకు సమాచార మిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన ప్రాంతంలో లభించిన సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం నెంబర్ ఆధారంగా అతని ఆచూకీని కనుగొని బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు(39) తండ్రి పోచం 25సంవత్సరాల క్రితం మృతిచెందాడు. తల్లి లక్ష్మీ కూడా 16సంవత్సరాల క్రితం మృతిచెందింది. నాగరాజుకు సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో 15 సంవత్సరాల క్రితం కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌లోని ఫిలింనగర్ సమీప ంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అవివాహితుడైన నాగరాజు చిన్నప్పటి నుంచి మధుమేహం వ్యాధితో బాధపడు తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై వచ్చిన నాగరాజు అనంతారం గ్రామ ఫ్లైఓవర్ కింద సజీవ దహనమైన స్థితిలో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు నాగరాజు తాను వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను బైక్ మీద కూర్చొని ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి మూడు కిలోమీటర్ల దూరంలో గల గూడూరు టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలించగా బైక్‌పై అతడు ఒక్కడే వచ్చినట్లు రికార్డు అయిందని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ ఘటనా స్థలంలో క్లూస్ టీం క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజుకు వరుసకు సోదరుడైన రిటైర్డ్ తహసీల్దార్ ముల్కల సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో కృష్ణవేణికి గోల్డ్ మెడల్



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 5: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించిన కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా జట్టుకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్ మాట్లాడుతూ కృష్ణవేణి గోల్డ్ మెడల్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన కబడ్డీ రాష్ట్ర కమిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్, నామా నర్సింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

- నివాసగృహాలు, గెస్ట్‌హౌస్‌లపై కొరడా
- చర్యలు చేపట్టిన అధికారులు


సాగర్ హిల్‌కాలనీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 5: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో కృష్ణానది తీరంలో అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. కృష్ణానది తీరంలో సామాన్య ప్రజలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించి, నివాసగృహాలు, అతిథిగృహాలు నిర్మించుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన మునిసిపల్ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నారు. తాజాగా సోమవారం హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహం వెనక వైపున నదీతీరంలో నిర్మించుకున్న ఓ బీఆర్‌ఎస్ నాయకుడి గెస్ట్‌హౌజ్‌ను మునిసిపల్ అధికారులు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో కూల్చివేశారు. అలాగే ఫైలాన్‌కాలనీలో ఓ ప్రైవేట్ ఉద్యోగి నిర్మించుకున్న అక్రమ కట్టడాన్ని కూడా నేలమట్టం చేశారు. ఈ అక్రమకట్టడాలు అన్ని టీఎస్ బీపాస్ మునిసిపల్ యాక్ట్ 2019 ప్రకారం కూల్చివేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ వీ రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని క మిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్, ఇన్‌చార్జి కమిషనర్ వీరారెడ్డి, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేశారు

విజయవిహార్ వెనక వైపున ఉన్న స్థలంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకున్న నివాసగృహాన్ని జీవో నంబర్ 59 ప్రకారం దరఖాస్తు కూడా చేసుకున్నాం. మునిసిపల్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే మరో రెండు రోజుల్లో గృహప్రవేశం ఉండగా కూల్చివేయడం ఎంతవరకు సమంజసం.

- అవుదొడ్డి కార్తీక్, బాధితుడు

మద్యానికి బానిసై ఆత్మహత్య

వలిగొండ, ఫిబ్రవరి 5: మద్యానికి బానిసై ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన వసల సతీష్‌కుమార్(24) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానివేయాలని కుటుంబసభ్యులు ఎంత చెప్పినా అతనిలో మార్పు కనబడలేదు. ఆదివారం సాయంత్రం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. సోమవారం ఉదయం సతీష్‌కుమార్ తండ్రి బాలస్వామి పొలానికి వెళ్లగా అక్కడ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కుమార్‌కు భార్య భాగ్యరేఖ, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 5: బైక్, తుఫాన్ ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలో చోటుచేసుకుంది. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై కొలనుపాకకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఆలేరు నుంచి సిద్ధిపేటకు వెళ్లే రహదారిలో ఆశ్రమం వద్దకు వస్తుండగా ఆలేరు నుంచి కొలనుపాక వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని ఆలేరులోని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీబీనగర్, ఫిబ్రవరి 5: యాదాద్రి భువనగిరి జిల్లా బీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వలిగొండ మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన సాధు చంద్రశేఖర్‌రెడ్డి(23) హైదరాబాద్‌లో వాటర్ వాషింగ్ సెంటర్ నడుపుతున్నాడు. ఆదివారం స్వగ్రామం కాంచనపల్లికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి అదే రోజు రాత్రి టీఎస్ 30 హెచ్ 4040 నెంబర్ గల ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గూడూరు టోల్‌ప్లాజా వద్ద టీఎస్ 05యూడీ 4546 నెంబర్ గల లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి పైనుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో లారీ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు సాధు విక్రమ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్‌గౌడ్ తెలిపారు.

భూ సమస్య పరిష్కారం కావడంలేదని మనస్తాపం

- ఆత్మహత్య చేసుకుందామని పురుగుమందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చిన మహిళ
- సూర్యాపేట కలెక్టరేట్‌లో ఘటన

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: తన కుటుంబ సభ్యుల వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు మ్యూటేషన్ చేయనందుకు ఆమె మనస్తాపం చెందింది. ఆత్మహత్య చేసుకోవాలని పురుగు మందు డబ్బాతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుని ఆమెను కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. బాధితురాలు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన నాతాల పూలమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె తండ్రి సుంకిరెడ్డి నారాయణరెడ్డి పదేళ్ల క్రితం మరణించాడు. నారాయణరెడ్డి పేరిట చివ్వెంల రెవెన్యూ శివారులో పలు సర్వే నెంబర్లలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని తల్లి సుశీలమ్మ పేరున మ్యూటేషన్ చేయాలని ఏడాది క్రితం మీసేవా ద్వారా పూలమ్మ దరఖాస్తు చేసింది. కాగా ఆన్‌లైన్‌లో సంబంధిత భూమి నెంబర్లకు డేటా కనెక్షన్ లింక్ అయింది. దానిని తొలగించి మ్యూటేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని పూలమ్మ ఆరోపించింది. తల్లి సుశీలమ్మకు వయస్సు పైబడుతున్నందున చేసేదిలేక, కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని భావించించింది. పురుగు మందు డబ్బా తీసుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు పూలమ్మ సంచిని తనిఖీ చేయగా పురుగు మందు డబ్బా కనిపించింది. వెంటనే ఆమె వద్ద ఉన్న పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుని పూలమ్మను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వెంకట్రావ్ సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.


పూలమ్మ నుంచి పురుగుమందు డబ్బా స్వాధీనం చేసుకున్న భద్రతా సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు విద్యార్థుల పోస్ట్‌కార్డు

తిప్పర్తి, ఫిబ్రవరి 5 : తమ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం పోస్టు కార్డులు రాశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని మామిడాల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, నాలుగు ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయులు లేక చదువుల్లో వెనుకబడుతున్నామని పేర్కొన్నారు. పాఠశాలలో బాలికల మూత్రశాలలకు పై కప్పులేని ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డులు రాసి పంపించారు. ఈ సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారు కోరారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి విద్యార్థులు సీఎంకు లేఖ రాడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


పోస్టుకార్డులు చూపుతున్న విద్యార్థులు

అంగన్‌వాడీలో కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలు

అనంతగిరి, ఫిబ్రవరి 5: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుక్కర్ పేలి ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది సోమవారం పప్పు వండుతుండగా కుక్కర్ హఠాత్తుగా పేలింది. ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రంలో 15మంది చిన్నారులు ఉండగా, నీలం అభినవ్, కరిశ తస్నీకి గాయాలయ్యాయి. తహసీల్దార్ రవికుమార్, అంగన్‌వాడీకేంద్రానికి వచ్చి చిన్నారులను కోదాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. శాంతినగర్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఒక కేంద్రంలో టీచర్ తన వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ కేంద్రాన్ని మరో అంగన్‌వాడీ కేంద్రంలో కలిపి నిర్వహిస్తున్నారు.

బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జైలు

సూర్యాపేటలీగల్, ఫిబ్రవరి 5: బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జీ జి. రాజగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన మాలోతు నాగేశ్వర్‌రావు కుమారుడు ఉపేందర్ 2016 ఆగస్టు ఏడో తేదీన కోదాడలో హేర్ కటింగ్ చేయించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా, అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మిర్యాలగూడెం నుంచి కోదాడకు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఉపేందర్ అక్కడిక్కడే మరణించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కోదాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏ.శ్రీదేవి 2019 డిసెంబరు నాలుగో తేదీన నిందితుడూన జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన అద్దంకి చినబాబుకు ఒక సంవత్సరం జైలు, రూ.1000జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. తీర్పును సమర్థిస్తూ జిల్లా కోర్టు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

చౌటుప్పల్‌లో ఆగని భూకబ్జాలు



ఆక్రమిత స్థలంలో కడీలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది(ఫైల్)

● ప్రభుత్వ అధికారులు హెచ్చరించినా పట్టించుకోని వైనం

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 5: హైదరాబాద్ నగరానికి కూతవేటులో ఉన్న చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములను భూకబ్జా కోరులు అన్యాక్రాంతం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను అనుకోని పట్టా భూములను కొనుగోలు చేయడం, వెంచర్లు చేయడం, చేసిన వెంచర్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లకు బై నెంబర్‌లు వేసి అమాయక ప్రజలకు విక్రయించి లాభాలు ఆర్జించి ప్రజలను మోసం చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో వెంచర్లు

చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డులో సర్వే నెంబర్ 113లో ప్రభుత్వ భూమి 8-05 ఎకరాలు ఉంది. ఈ భూమిలో రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం చౌటుప్పల్‌లోని పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించింది. ఈ సర్వే నెంబర్ పక్కనే ఉన్న పట్టా భూమిలో చౌటుప్పల్‌కు చెందిన కొంతమంది రియల్టర్లు వెంచర్ చేసి ప్లాట్లను విక్రయించారు. ప్లాట్లను బై నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేశారు. కబ్జా మాత్రం పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో చూపించారు. గతంలో చౌటుప్పల్ మండలంలో కొంత మంది రియల్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్‌లు నమోదు అయ్యాయి. అధికారులు హెచ్చరించినా కబ్జాలు ఆగడం లేదు.

హద్దు రాళ్లను తొలగించిన మునిసిపల్ సిబ్బంది

ప్రభుత్వ స్థలంలో హద్దు రాళ్ల నాటి కబ్జా చేసిన స్థలంలోని హద్దు రాళ్లను మునిసిపల్ సిబ్బంది గత నెల30న తొలగించారు. సర్వే నెంబర్ 113 ప్రభుత్వ భూమిలో సర్వే నెంబర్ 120 వేసి రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్ హద్దు రాళ్లతో పాటు ప్రభుత్వ స్థలంలో కబ్జా చేసిన 100 గజాల ప్లాట్ హద్దు రాళ్లను తొలగించారు. గత నెల 20వ తేదీన ఇదే ప్రభుత్వ స్థలాన్ని చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు సమక్షంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి సుమారు ఎకరం ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తేల్చి హద్దు రాళ్లను నాటారు. అయితే ప్రభుత్వ అధికారులు సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటు చేసి పది రోజులు గడవక ముందే ఇదే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడంపై పలు విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ, మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. ప్రభుత్వ స్థలాలను కాపాడాలని గతంలో చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశాం. రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దు రాళ్ల ఏర్పాటు చేశారు. అయినా కొంతమంది బరితెగించి కబ్జాలకు పాల్పడుతున్నారు.

-సుర్కంటి వెంకట్‌రెడ్డి, తొర్పునూరి రవి స్థానికులు

త్వరలోనే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం

చౌటుప్పల్ పరిధిలోని సర్వే నెంబర్ 113లో సర్వే పూర్తయింది. 114లో ఈనెల 9వ తేదీన సర్వే నిర్వహిస్తాం. ఇప్పటికే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హద్దురాళ్లు ఏర్పాటు చేశాం. త్వరలోనే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. బైనెంబర్ రిజిస్ట్రేషన్ల విషయమై బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ నిర్వహించి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

-ఆర్డీవో జగన్నాథరావు, చౌటుప్పల్

ప్రభుత్వ భూములను కాపాడాలి



ఆర్డీవోకు జర్నలిస్టుల వినతిపత్రం అందజేత జర్నలిస్టులు

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 5: చౌటుప్పల్ మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని చౌటుప్పల్ జర్నలిస్టులు ఆర్డీవో జగన్నాథరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ మునిసిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 113, 114 లలోని ప్రభుత్వ భూములను కొంతమంది భూకబ్జాదారులు ఆక్రమించారని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. రెవిన్యూ అధికారులు ఇటీవల సర్వే జరిపి నిర్ణయించిన హద్దురాళ్ళను తొలగించారని తెలిపారు. జర్నలిస్టులకు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

రిటైర్డు ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

మోత్కూరు, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఈ నెల 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మోత్కూరులోని రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యాలయంలో మెడివిజన్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బద్దం యాదిరెడ్డి, ఆకవరం వల్లభాయ్ తెలిపారు. మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల రిటైర్డు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హెల్త్ కార్డులు తీసుకుని వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

10న మునిసిపల్ మడిగెలకు బహిరంగ వేలం

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 5: పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న 22 షాపులకు ఈ నెల 10న బహిరంగ వేలం నిర్వహించేందుకు మునిసిపల్ అధికారులు సన్నాహాలు చేయాలని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఒక ప్రకటనలో సూచించారు. మునిసిపల్ ఆదాయాన్ని రెట్టింపు చేసే విధంగా బిడ్డింగ్ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఈ నెల 9వ తేదీ వరకు మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్‌రెడ్డి తెలిపారు. మునిసిపల్ కార్యాలయ పనివేళల్లో దరఖాస్తు నిర్ణీత రుసుము రూ.500 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకోవాలని, బహిరంగ వేలంలో పాల్గొనే వారు షాపుల వారీగా నిర్ణయించిన డిపాజిట్‌ను ఏదైనా జాతీయ బ్యాంకు ద్వారా డిడి తీసి చెల్లించాలని కోరారు. ఈ వేలం కాలపరిమితి ఐదు సంవత్సరాలకు కాల పరిమితి నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలి

మోత్కూరు, ఫిబ్రవరి 5: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 2020 నవంబరు 1 నాటికి డిగ్రీ, ఆపైన ఉత్తీర్ణులైన వారు ఓటు కోసం తమ పేరు నమోదు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఓటు నమోదుకు గడువు ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినందున పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

బీజేపీ నాయకులు పల్లెలకు వెళ్లాలి: భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు బీజేపీ నాయకులందరూ పల్లెలకు వెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనతో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తోందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో బీజేపీదే గెలుపని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన యాత్రను పురస్కరించుకుని ఈ నెల 11న భువనగిరిలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు బందారపు లింగస్వామి, చిక్క కృష్ణ, సిరిగె శ్రీనివాస్, దూడల భిక్షం, పి.ఉమాశంకర్ రావు, జంగారెడ్డి, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

బస్వాపూర్ సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బస్వాపూర్ గ్రామస్తులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను విడతల వారిగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేను కలిసి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని బస్వాపూర్ నుంచి గంగసాని పల్లికి వెళ్లే మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని, గ్రామం నుంచి చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరడంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చానట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల శ్రీనివాస్ మచ్చ పాండు, చిన్నం శ్రీనివాస్, మైసయ్య, పోచమ్మ, గిరీష్, వెంకటేష్ ఉన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి: ఏబీవీపీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఝాన్సీ, పీవీ.శ్యాంసుందర్‌రావు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 5: దేశ భవిష్యత్తును నిర్దేశించే విద్యారంగానికి ప్రభుత్వాలు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. సోమవారం భువనగిరిలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దితే దేశం, సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పాలకులు గ్రహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న విద్యార్థులపై ప్రభుత్వం, పోలీసుల అరాచకాలను మానుకోవాలని, లేని పక్షంలో విద్యార్థుల తిరుగు బాటు తప్పదన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ 75 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్వామి వివేకా నంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతులను పురస్కరించుకుని నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి



చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ రాజుకు సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రామన్నపేట/ చౌటుప్పల్ మునిసిపాలిటీ/ భూదాన్ పోచంపల్లి/ ఫిబ్రవరి 5: కేంద్ర బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను దిక్కరిస్తూ ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. ఈనెల 16న జరిగే కార్మిక సమ్మె గ్రామీణ బంద్ పోస్టర్ సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు గడుస్తున్నా రైతు, కార్మిక ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, నకిరెకంటి రాము, వంగాల మారయ్య, బూడిద భిక్షం, దండిగ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక హక్కుల సాధనకోసం ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.పాషా పిలుపునిచ్చారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా కమిటి సభ్యులు బత్తుల దాసు, సీపీఎం మునిసిపల్ నాయకులు దండ అరుణ్ కుమార్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మ, అన్నపూర్ణ, శ్రీలత, జ్యోతి పాల్గొన్నారు.

● సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు కోరారు. దేశవ్యాప్త సమ్మె సందర్భంగా సమ్మె నోటీసును సోమవారం సీఐటీయూ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్ చంద్రమౌళికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ సామాన్య ప్రజల కార్మిక, కర్షక హక్కులపై దాడి చేస్తోందని అన్నారు. కేంద్ర సర్కారు కేవలం మాటల్లో జాతీయత ఆచరణలో విదేశీజపం చేస్తోందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తివేసి, పేద పిల్లలకు ఆకలి కేకల్లోకి నెట్టే బీజేపీ ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు కళ్లెం వేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పగిల్ల లింగారెడ్డి, నాయకులు ప్రసాదం విష్ణు, సీఐటీయూ నాయకులు బాలయ్య, సత్తయ్య, చాంద్‌పాషా, లింగస్వామి, బాబు, శంకరయ్య, ఉపేందర్, లక్ష్మీ, జయమ్మ, స్వప్న, శారద, పద్మ, అమృత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మోత్కూరు : మోత్కూరు మునిసిపల్ నాలుగో వార్డు కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మయాదయ్య కుమారుడు పరశురామ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎమ్మెల్యే మందుల సామేల్ కొండగడపలోని వారి ఇంటికి వెళ్లి పరశురామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తల్లిదండ్రులు మల్లమ్మయాదయ్యను, ఇతర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, అంతటి నర్సయ్య, కస్తూరి వీరస్వామి, ఉప్పలయ్య ఉన్నారు.

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీలోని రెండో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు బోడ శ్రీనివాస్ కుమారుడు మల్లేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అతని ఇంటికి వెళ్లి మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ అడ్డగూడూరు మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మోత్కూరు పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, నాయకులు మర్రి అనిల్‌కుమార్, దబ్బెటి శైలజ, చెడిపల్లి రఘుపతి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో గాంధీజీ సంస్థలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవలు ప్రశంసనీయమని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను చౌటుప్పల్ పట్టణంలోని శ్రీనిటీ విద్యాసంస్థల ఆవరణలో చైర్మన్ రాజు ఆవిష్కరించారు. గాంధీ సంస్థల ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యా రాణి, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీలత, శ్రీనిటీ విద్యా సంస్థల చైర్మన్ కె.కృష్ణారావు, ప్రిన్సిపాల్ వి.మంజుల, మాజీ సర్పంచ్ సుర్వి నర్సింహ, అయ్యప్ప దేవాలయం ఫౌండర్ బి.మురళి, సభ్యులు సంధ్య, నీరజ, మమత, జయశ్రీ, భవానీ, ఝాన్సీ రాణీ, ప్రసన్న లక్ష్మి, కీర్తన, అనూషన్ పాల్గొన్నారు.

మోత్కూరు : కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు భువనగిరి ఎంపీగా పోటీ చేయడానికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ మోత్కూరు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంటు గుండు శ్రీను కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా బీసీ అభ్యర్థి అయిన వెంకన్నకే అవకాశమివ్వాలని ఆయన కోరారు.

మోత్కూరు : పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణ పరిధిలో ఉన్న ఇళ్లు, దుకాణాల నిర్మాణాలను యజమానులు వెంటనే తొలగించుకోవాలని మునిసిపల్ సిబ్బంది కోరారు. సోమవారం వారు రోడ్డు విస్తరణ పరిధిలో ఉన్న నిర్మాణాల యజమానులను కలిసి వెంటనే నిర్మాణాలను తొలగించాలని లేని పక్షంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తే ఎక్కువ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

గుండాల: గుండాల మండలం వెల్మజాల గ్రామంలోని రాగన్నకుంటలో కొందరు చేపలు పట్టి నష్టం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తహసీల్దార్ కుమారికి సోమవారం వినతి పత్రం అందచేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జయంత్‌కుమార్

చౌటుప్పల్ టౌన్/చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 5: విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిణి కె.భవాని అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని కస్తూర్బా బాలికల విద్యాలయంతో పాటు లింగారెడ్డి గూడెం ప్రాథమిక పాఠశాల లో సోమవారం దివీస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రూ.2.60 లక్షల విలువైన స్కూల్ బ్యాగులు, పాదరక్షలను ఆయా పాఠశాలల్లోని 310 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ దివీస్ సంస్థ యాజమాన్యం విద్యార్థుల ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించడం అభినందనీయమని, ఆ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకుంటామని ఆమె అన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ వైద్యాధికారి జయంత్‌కుమార్, దివీస్ సంస్థ ప్రతి నిధులు వి.వెంకటరాజు, సాయి కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకారం అందించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పాండుగౌడ్

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారి గోద పాండుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని బొల్లేపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాండు నాయక్, ఉపాధ్యాయులు రాంబాబు, విజయేందర్‌రెడ్డి, పద్మ లత, శ్రీనివాసచారి, ఉపేందర్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న శ్రీచరణ్

ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 5: మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ సహకారంతో సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే మంచి సంకల్పంతో స్టడీ మెటీరియల్ అందించిన సంస్థకు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కె.భాస్కర్‌రెడ్డి, డి.స్వామి, వెంకటనర్సయ్య, షమీమ్, శిరీష, వెంకటేశం, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడిని సాధించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 5: వ్యవసాయ అధికారులిచ్చే సూచనలు పాటించి, రైతులు అధిక దిగుబడిని సాధించాలని ఏడీఏ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొలనుపాకలో క్షేత్ర సందర్శనలో భాగంగా పలు రైతుల పంటలను పరిశీలించి, సూచనలు అందజేశారు. యాసంగిలో వరికి కాండం తొలిచే పురుగు ఆశించి పంట నష్టం చేస్తుందని, వాటి నివారణకు మందులను వాడాలన్నారు. నారు నాటేందుకు వారం రోజుల ముందు ఎకరాకు 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ పీజీ గులకలు, 600 గ్రాముల పిప్రోనిల్ 03 గ్రాముల గులకలు చల్లాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శివకుమార్, రైతులు మహేందర్, అంజనేయులు, ఉదయ్, కిరణ్, సత్తయ్య, శంకర్ ఉన్నారు.

సివిల్ కాంట్రాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్



శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందిస్తున్న కాంట్రాక్టర్ల సంఘం కార్యవర్గ సభ్యులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: సివిల్ కాంట్రాక్టర్ల సంఘం జిల్లా ఎన్నికలు సోమవారం హైదరాబాద్‌లో జరిగాయి. భువనగిరికి చెందిన ఐతగాని శ్రీనివాస్‌గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎస్.మల్లేశం, సలహాదారులుగా ఎడ్ల సత్తిరెడ్డి, సోమ శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

జోన్-5 అధ్యక్షుడిగా కె.సుదర్శన్



భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.సుదర్శన్‌ను తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా జోన్-5 అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రవాణా శాఖ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో 33 జిల్లాలకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎల్.కిష్టయ్య తెలిపారు.


ఆచరణసాధ్యంకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి

అడ్డగూడూరు, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంట్, నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని దుయ్యబట్టారు. రైతులకు రైతు బంధు పడలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల బస్సుల్లో మహిళలు కొట్టుకునే పరిస్థితి రాగా, ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 7న తుంగతుర్తిలో జరిగే నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్, సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి చౌగోని సత్యంగౌడ్, మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్‌రెడ్డి, గూడెపు పరమేష్ ఉన్నారు.

ఐదేళ్లలో గ్రామాన్ని అభివృద్ధి చేశాం



పొడిచేడులో మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు

మోత్కూరు, ఫిబ్రవరి 5: మండంలోని పొడిచేడు గ్రామంలో గత 30ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపామని మాజీ సర్పంచ్ పేలపూడి మధు అన్నారు. మాజీ సర్పంచ్ మధు, వార్డు సభ్యులకు సోమవారం గ్రామంలో నిర్వహించిన వీడ్కోలు, సన్మాన సభలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ సహకారంతో గ్రామంలో సుమారు రూ.4 కోట్ల విలువైన సీసీరోడ్లు, మట్టి రోడ్లు, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, విద్యుత్ వీధి దీపాలు, మురికి కాల్వలు, పాఠశాల ప్రహరీ పనులు చేశామన్నారు. ఉపసర్పంచ్ కప్పె వెంకటేశ్, వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు.